క్లుప్తంగా

నేలకొరిగిన వృక్షం



వుడా ఫేజ్-1లో కూలిన చెట్టు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు వుడా ఫేజ్-1లో రహదారి పక్కనే ఉన్న భారీ చెట్టు నేలకొరిగింది. రాజీవ్‌నగర్ ప్రధాన రహదారిలో వుడా ఫేజ్-1లోని ఏవీఎం పాఠశాల రహదారిలోని ఈ వృక్షం భారీ వర్షాల కారణంగా సోమవారం రాత్రి పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశంలో పడిపోయింది. రాత్రి వేళ కావడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు.

వాల్వ్ లీకేజీతో నీరు వృథా



రాజీవ్‌నగర్‌లో వాల్వ్ నుంచి వృథాగా పారుతున్న నీటిని పట్టుకుంటున్న స్థానికులు

అగనంపూడి: జీవీఎంసీ నీటి సరఫరా పైప్‌లైన్ వాల్వ్ లీకేజీ కారణంగా మంచి నీరు వృథాగా పోతుంది. జీవీఎంసీ 86వ వార్డు రాజీవ్‌నగర్‌లోని భూగర్భ పైప్‌లైన్‌కు అమర్చిన వాల్వ్ కొన్ని నెలలుగా లీకవుతోంది. ఎయిర్ లీక్ కోసం చిన్న ధార పారేలా అమర్చిన వాల్వ్ నుంచి నీరు అధిక మొత్తంలో పోతుంది. కొంత మంది మహిళలు వాల్వ్ వద్ద నీటిని పట్టుకుంటున్నారు. అధిక మొత్తంలో నీరు వృథాగా పోతుండడంతో నీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రజకుల ఆరాధ్య దైవం ఐలమ్మ



ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా రజక సంఘం నాయకులు

అగనంపూడి: రజకుల ఆరాధ్య దైవం చాకలి ఐలమ్మ అని ఉమ్మడి విశాఖ జిల్లా రజక సంఘం అధ్యక్షుడు తోకాడ రాము అన్నారు. చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి పురస్కరించుకుని అగనంపూడిలో ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాట యోధురాలిగా.. భావితరాలకు స్ఫూర్తిదాయకమైన చాకలి ఐలమ్మ సేవలు రజక జాతి మరువలేనివన్నారు. సాయుధ రైతాంగ పోరాటానికి నాంది పలికారని కొనియాడారు. కార్యక్రమంలో పాలమూరు గురునాథరావు, కసింకోట జయనాథ్, అద్దూరి శ్రీనివాసరావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

తాగునీరు బురదమయం



బురదమయంగా భెల్ టౌన్ షిప్‌లో తాగునీరు

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) టౌన్ షిప్‌లో మౌలిక వసతులు నానాటికీ దిగజారిపోతున్నాయని టౌన్ షిప్‌లో నివాసం ఉంటున్న కార్మికులు గగ్గోలు పెడుతున్నారు. కొద్ది రోజుల నుంచి తాగునీరు బురదమయంగా వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై క్వార్టర్స్ నిర్వహణ విభాగం, శానిటేషన్ విభాగం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. బురదమయంగా ఉన్ననీరు ఎలా తాగాలని గగ్గోలు పెడుతున్నారు. రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని, క్వార్టర్లు జంగిల్‌ను తలపిస్తున్నాయని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. యాజమాన్యం టౌన్ షిప్ నిర్వహణపై యాజమాన్యం దృష్టి సారించి కార్మిక, ఉద్యోగులకు మౌలిక వసతులు కల్పించాలని నివాసీయులు కోరుతున్నారు.



వడ్లపూడి ప్రధాన రహదారిలో ఇదీ పరిస్థితి



వర్షానికి పాడైన వినాయకనగర్ రోడ్

రహదారులు గుంతల మయం

భారీ వర్షాలతో ధ్వంసమైన రోడ్లు ● మరమ్మతులకు రూ.3.24 కోట్లతో ప్రతిపాదనలు

గాజువాక: తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు గాజువాకలో రోడ్లు దెబ్బతిన్నాయి. కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలు కూలిపోయాయి. రహదారులు గుంతల మయంగా మారి రాకపోకలు నరకప్రాయంగా మారాయి. వాహనాలు దెబ్బతింటున్నాయి. దీంతో గాజువాకలో రోడ్ల మరమ్మతులపై జీవీఎంసీ అధికారులు దృష్టి సారించారు. దీనికోసం రూ.3.24 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

అవస్థల మయం

భారీ వర్షాలకు రోడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎక్కడ చూసినా గోతులు దర్శనమిస్తున్నాయి. వరద ఉధృతికి పలు చోట్ల ఇటీవల వేసిన రోడ్లు కూడా దెబ్బతిన్నాయి. జాతీయ రహదారి సైతం గోతులతో నిండిపోయింది. అడుగడుగునా గోతులు పడడంతో వాహన చోదకులు అవస్థలకు గురవుతున్నారు. వివిధ కాలనీలకు సంబంధించిన ప్రధాన రహదారులు కూడా శిథిలమైపోయాయి. ఈ పరిస్థితుల్లో రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని గాజువాక జోనల్ అధికారులు నిర్ణయించారు. 20 వార్డుల్లో విస్తరించి ఉన్న గాజువాక జోన్‌లో ప్రస్తుతం 18 వార్డుల్లో రోడ్లకు రూ.3.24 కోట్లతో మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కొన్నిచోట్ల బీటీ రోడ్లకు ప్యాచ్ వర్కులు, మరికొన్నిచోట్ల సిమెంట్ రోడ్ల మరమ్మతులతోపాటు ఒకటిరెండు చోట్ల హాట్ మిక్స్ రోడ్లు వేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదించారు. కమిషనర్ నుంచి అనుమతులు మంజూరైన వెంటనే పనులు చేపడతామని జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడు తెలిపారు.

కొండవాలు నష్టాలపైనా అంచనాలు

తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు కొండవాలు ప్రాంతాల్లో చోటుచేసుకున్న నష్టాలపైనా గాజువాక రెవెన్యూ అధికారులు అంచనాలు సిద్ధం చేస్తున్నారు. గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు గాజువాక మండలంలోని వివిధ కొండవాలు కాలనీల్లో రిటైనింగ్ గోడలు పడిపోయిన విషయం తెలిసిందే. 71వ వార్డు శ్రీరామ్‌నగర్, అరుణోదయ కాలనీ, 65వ వార్డు భానోజీ కాలనీలో రిటైనింగ్ వాల్స్ కూలిపోయాయి. వీటిపై సమాచారం అందుకున్న గాజువాక తహసీల్దార్ టి.శ్రీవల్లి ఆయా ప్రాంతాలను పరిశీలించారు. నష్టంపై అంచనాలు రూపొందిస్తున్నట్టు ఆమె తెలిపారు.



అరుణోదయ కాలనీలో జారిపడ్డ రిటైనింగ్ వాల్

మర్యాద పూర్వక కలయిక



సీఐ మల్లేశ్వరరావును అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ గాజువాక మండల అధ్యక్షుడు గోవింద్

అగనంపూడి: దువ్వాడ సీఐగా బాధ్యతలు చేపట్టిన మల్లేశ్వరరావును వైఎస్సార్‌సీపీ గాజువాక మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా, పుష్పగుచ్ఛంతో అభినందించారు. కార్యక్రమంలో ఎన్నేటి రమణ, చిత్రాడ వెంకటరమణ పాల్గొన్నారు.



ట్రాఫిక్ సీఐ వెంకటరావును అభినందిస్తున్న అగనంపూడి నాయకులు

● దువ్వాడ ట్రాఫిక్ సీఐగా బాధ్యతలు చేపట్టిన కిల్లి వెంకటరావును అగనంపూడికి చెందిన ప్రజాసంఘాల నాయకులు అభినందించారు. కూర్మన్నపాలెంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో నాయకులు బి.సత్యనారాయణ, జి.అప్పారావు, ఎం. ఉమామహేశ్వరరావు, పులగపూరి ఆశాలత, కోసూరి తాతారావు, ఎ.ఈశ్వరరావు కలిసి సత్కరించారు.

ప్రభుత్వ నిర్దేశిత సెలవులు పాటించాలి

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారామ్

గాజువాక: విద్యార్థుల మనోవికాసానికి ప్రతినెలా రెండో శనివారం, ప్రతి ఆదివారంతో పాటు నిర్దేశిత పండగలు, సెలవు దినాలను ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు కచ్చితంగా పాటించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ అన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్ల పాత్ర అనే అంశంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, జిల్లా విద్యాశాఖ సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అనేక ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు బాలల హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నాయన్నారు. వీటిపై తమకు ఎప్పటికప్పుడు ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయన్నారు. సెలవులు పాటించడంలో యాజమాన్యాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయని, తద్వారా విద్యార్థులు మానసిక ఆనందానికి దూరంగా ఉండటాన్ని తమ కమిషన్ సీరియస్‌గా పరిగణిస్తోందన్నారు.


జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో లైంగిక దాడుల నిర్మూలన, మంచి, చెడు స్పర్శలపై అవగాహన, ఆడపిల్లల రుతుస్రావం సమయంలో ఒత్తిడిలేని విద్యను అందించే ఆరోగ్య సూత్రాల అమలు, బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కార్యక్రమాలను ఎప్పటికప్పుడు నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించలేదన్న నెపాన్ని పిల్లలపై నెట్టడం సరికాదన్నారు. కార్యక్రమంలో గ్రీన్ ఎంబసీ ఫౌండర్ ఉమారాజ్, సైకాలజిస్ట్ ఎం.వంశీ, క్లినికల్ సైకాలజిస్ట్ పార్వతి కస్యస్, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఖలీషా బేగం, గాజువాక, పెదగంట్యాడ మండల విద్యాశాఖాధికారులు బి.విశ్వనాథ్, సునీత, రమణాజీ, ఇ.శ్రీనివాస్, జిప్సా అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు, సర్వశిక్ష అభియాన్ ఏపీసీ శ్రీనివాస్, గాజువాక చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ నీలవేణి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ అరుణ పాల్గొన్నారు.



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న గొండు సీతారామ్

భయపెడుతున్న బండరాళ్లు

దయాళ్‌నగర్ కొండవాలు ప్రాంతంలో కలవరం



దయాళ్‌నగర్ క్వారీ రోడ్డులో కూలడానికి సిద్ధంగా ఉన్న బండరాళ్లు



రోడ్డు పక్కన ప్రమాదకరంగా కనిపిస్తున్న రాళ్లు

పెదగంట్యాడ: బండరాళ్లు భయపెడుతున్నాయి.. ప్రజల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి.. ఏ క్షణంలోనైనా కూలడానికి సిద్ధంగా ఉండడంతో వారంతా భయంతో వణికిపోతున్నారు. జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని దయాళ్‌నగర్ ప్రాంత ప్రజలు దిన దిన గండం.. నూరేళ్ల ఆయుష్షు అన్న చందంగా బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. దయాల్‌నగర్ మొత్తం కొండవాలు ప్రాంతం కావడంతో ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు ఆ ప్రాంతంలోని మట్టి కరిగిపోయింది. దీంతో బండరాళ్లు బయటపడ్డాయి. అవి కాస్తా ఇప్పుడు కిందపడేలా ఉన్నాయి. ఈ బండరాళ్ల కింద పలు నివాస గృహాలు ఉన్నాయి. అర్ధరాత్రి వేళ అవి పడితే మా పరిస్థితి ఏంటని వారంతా ఆందోళన చెందుతున్నారు.

రక్షణ చర్యలు చేపట్టాలి



దయాల్‌నగర్ మొత్తం కొండవాలు ప్రాంతం. ఇక్కడ వేలాది మంది స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు.కొండవాలు ప్రాంతంలో కనీస రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో వర్షాలు పడితే ఆందోళన చెందాల్సిన దుస్థితి. ఈ ప్రాంతంలో రక్షణ చర్యలు చేపట్టాలని పలుమార్లు ప్రజా ప్రతినిధులు, అధికారులను కోరినా ఫలితం లేకపోయింది. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు.

– డాక్టర్ ఎస్.రాజారావు, దయాళ్‌నగర్ క్వారీ రోడ్డు కాలనీ అధ్యక్షుడు

ఉక్కు ఉద్యమంపై ఆంక్షలు తగవు

అగనంపూడి: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ మూడున్నర సంవత్సరాలుగా ఉద్యోగులు, కార్మికులు, నిర్వాసితులు, కాంట్రాక్ట్ కార్మికులు, స్థానికులు ఉద్యమాలు చేస్తుంటే ఎన్నికల్లో ప్రైవేటీకరణను అడ్డుకుంటామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం నేడు నీరు గార్చేందుకు కుట్రలు చేస్తుందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి శ్రీనివాసరావు ఆరోపించారు. వడ్లపూడిలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమానికి ఊతమివ్వాల్సిన తెలుగుదేశం ప్రభుత్వం ఉద్యమాన్ని అణచివేయాలని చూడడం సరికాదన్నారు. ఇప్పటికైనా టీడీపీ ప్రభుత్వం ఉక్కు పరిరక్షణకు సహకారం అందివ్వాలని ఆయన కోరారు.

ఉక్కు సీఎండీపై ఫిర్యాదు

అగనంపూడి: స్టీల్ ప్లాంట్ అధికారి నాట్ర తాతారావు మరణంపై పోలీసులు, న్యాయస్థానాన్ని ఉక్కు సీఎండీ తప్పుదోవ పట్టిస్తున్నారని సమాచార హక్కు చట్టం కమిషనర్‌కు స.హ.చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు ఫిర్యాదు చేశారు. సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కావాలని అడిగిన ప్రతీ సారి కోర్టులో కేసు ఉందని తప్పుడు సమాచారం అందిస్తున్నారని పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థతో పాటు పోలీసుల అధికారులను తప్పుదోవ పట్టిస్తున్న సీఎండీపై చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

13న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

గాజువాక: ఆటోనగర్, వడ్లపూడి, కూర్మన్నపాలెం విద్యుత్ కార్యాలయాల పరిధిలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 13న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమం ఆటోనగర్ విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సమావేశంలో సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యుడు జనార్దనరావు, ఆర్థిక సభ్యుడు ఎం.శ్రీనివాస్, స్వతంత్ర సభ్యుడు సురేంద్ర కుమార్ తదితరులు హాజరు కానున్నట్టు తెలిపారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పోషకాహారం ప్రాధాన్యం తెలియజేసేలా గీసిన చిత్రాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

అగనంపూడి: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి.సూర్యప్రకాషరావు, మ్యాజిక్ బస్ సంస్థ మోనటరింగ్ అధికారి సురేంద్రకుమార్ అన్నారు. పోషకాహార వారోత్సవాల సందర్భంగా కణితి హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులు పోషక విలువలతో కూడిన ఆహారం, వాటి ఆవశ్యకతను తెలియజేస్తూ చిత్రాలు వేశారు. అవి ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణ కుమారి, పీడీ మన్నాజీ, నారాయణరావు, మ్యాజిక్‌బస్ ప్రతినిధులు నాగమణి, నర్సింగరావు, మోహరున్నీష, పైడమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ అసమర్థతతో భారీ నష్టం

- సహాయక చర్యలు శూన్యం.. ప్రచారం పీక్
- బాధితులను చిత్తశుద్ధితో ఆదుకోవాలి
- విజయవాడ వాసులకు మద్దతుగా పోరాడుతాం
- మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



గాజువాక: విజయవాడ వరదల్లో ఇంతటి నష్టానికి ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యత వహించాలి. ఇది ప్రకృతి సృష్టించిన వైపరీత్యం కాదు. ప్రభుత్వం సృష్టించిన విపత్తు.. ముందస్తు సమాచారం ఉన్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం వల్లే ఇంతటి ఘోరం చోటు చేసుకుందని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సమయంలో వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తుందని.. ప్రభుత్వం వెంటనే ప్రజలను అప్రమత్తం చేసి ఉంటే ఇంతటి ఘోరం జరిగేది కాదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వరదల్లో 45 మంది చనిపోగా.. అందులో 30 మందికి పైగా సకాలంలో ఆహారం, మందులు అందకపోవడం వల్లే చనిపోయాన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రచారం కోసం పాకులాడుతున్నారే తప్పా.. క్షేత్ర స్థాయిలో బాధితులకు సహాయం అందించడంలో విఫలమయ్యారన్నారు. ముఖ్యమంత్రి ఆఫీసులో ఉండి అధికారులను మానిటర్ చేయడం ద్వారా పరిస్థితిని చక్కదిద్దకుండా అధికారులను తన వెంట వేసుకొని తిరుగుతూ ప్రచారం చేసుకొంటున్నారని ఆరోపించారు. 1968, 1986, 1990, 2005 సంవత్సరాల్లో కూడా బుడమేరులో ఇంతకంటే రెట్టింపు నీరు వచ్చినా అప్పటి ముఖ్యమంత్రులు దాన్ని చాలా చక్కగా నిర్వహించి ప్రజలను రక్షించారన్నారు. తాను ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న 2022లో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరులో వరదల సమయంలో ఏడు ముంపు మండలాల్లో 250 గ్రామాలు మునిగిపోతే వెంటనే 102 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 18 వేల కుటుంబాలను తరలించామని అమర్‌నాథ్ చెప్పారు. విజయవాడ లాంటి ప్రాంతంలో వరద వచ్చినప్పుడు ప్రభుత్వం సక్రమంగా స్పందించక పోవడం వల్లే ఈ ఘోరం జరిగిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రచారం మాని వరద బాధితులకు చిత్తశుద్ధితో సహాయం అందించాలని డిమాండ్ చేశారు. వరద బాధితులకు న్యాయం జరిగే వరకూ తాము వారి తరఫున ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు.

కాలువ పునరుద్ధరించాలి

గెయిల్ యాజమాన్యానికి స్థానికుల డిమాండ్



గెయిల్ లోపల నీరు వెళ్లే కాలువ పునరుద్ధరించకపోతే మరో బుడమేరు అవుతుందని గెయిల్ గేటు ఎదుట ఏర్పాటు చేసిన బోర్డు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ టోల్ గేటు వద్ద గల గెయిల్ ఇండియా లిమిటెడ్‌లో నీరు ప్రవహించే మార్గాన్ని వెంటనే పునరుద్ధరించాలని లేని పక్షంలో మరో బుడమేరు పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుందని ఆ ప్రాంతాల వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం బాధిత ప్రాంతాలకు చెందిన వారు గతంలో గెయిల్‌లోపల ఉన్న కాలువ పరిస్థితిని వివరిస్తూ పలు చిత్రాలతో కూడిన ఫ్లెక్సీని గెయిల్ గేటు ఎదురుగా ఏర్పాటు చేశారు. భారీ వర్షాలు కురిసేటప్పుడు అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, షీలానగర్, వెంకటేశ్వరకాలనీ, నరవ, హరిజనజగ్గయ్యపాలెం, కిమ్స్ హాస్పటల్ నుంచి వరద నీరు జాతీయ రహదారిని దాటుకుంటూ సుబ్బిరామిరెడ్డి సైట్, రవీంద్రబాబు సైట్స్ మధ్య నుంచి గెయిల్ లోపల కాలువ గుండా సముద్రంలోకి చేరేదన్నారు. గెయిల్ యాజమాన్యం కొన్ని పనుల కారణంగా ఈ కాలువ మూసి వేసి కంపెనీ ముందు ప్రత్యామ్నాయంగా చిన్న కాలువ ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. దీంతో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, షీలానగర్, వెంకటేశ్వరకాలనీ, హరిజనజగ్గయ్యపాలెం వంటి పల్లపు ప్రాంతాల నుంచి భారీగా వర్షపు నీరు ఫ్లో ఎక్కువ అవ్వడంతో షీలానగర్ పెట్రోల్ బంక్ పక్కనున్న లారీల పార్కింగ్ ప్రాంతం పూర్తిగా నీటితో నిండిపోయిందన్నారు. దీంతో లారీల డ్రైవర్లు, క్లీనర్లు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. వెంటనే గెయిల్ యాజమాన్యం కంపెనీలో మూసివేసిన కాలువను పునరుద్ధరించాలని బాధిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉపాధ్యాయులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు

అగనంపూడి: ఉపాధ్యాయుల దీర్ఘ కాలిక సమస్యలు పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు అన్నారు. 85వ వార్డు పినమడక, లేమర్తి, లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఆయన ఉపాధ్యాయుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉమ్మడి సర్వీస్ రూల్స్ రూపొందించడం వల్ల ఉపాధ్యాయులకు పదోన్నతులు వంటి అంశాల్లో అధిక శాతం మందికి మేలు జరిగిందన్నారు. నేటికీ అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు బి.కాశీ విశ్వేశ్వరరావు, రౌతు నాగేశ్వరరావు, పెద్దినాయుడు, అమ్మాజీ, వెంకటరావు, రమణ, బాబూరావు, కొండబాబు, కోవెల రవి పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణ కోసం ఆందోళన బాట



గాజువాకలో ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్ష సంఘాల నాయకులు



పాతగాజువాకలో ఆందోళనకారుడిని అరెస్టు చేస్తున్న పోలీసులు

గాజువాక: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష కార్మిక సంఘాల పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా గాజువాకలో అఖిలపక్ష సంఘాలు ర్యాలీ, రాస్తారోకో నిర్వహించాయి. విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని, పూర్తి సామర్థ్యంతో నడపాలని నినదిస్తూ తొలుత ర్యాలీ నిర్వహించిన అఖిలపక్షాలు పాతగాజువాక జంక్షన్‌లో భారీ రాస్తారోకో నిర్వహించాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్‌పరం కానివ్వబోమని స్పష్టం చేశారు. కాగా, ఆందోళనకారులను గాజువాక పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, ఎం.రాంబాబు, జెర్రిపోతుల ముత్యాలు, కె.ఎం.శ్రీనివాస్, ఎల్లేటి శ్రీనివాసరావు, ఎ.లోకేష్, జె.రామకృష్ణ, ఆనంద్, మసేన్‌రావు, అప్పారి విష్ణుమూర్తి పంచదార్ల ఉగ్రం, ఎరబాల భూలోక, కె.అచ్యుతరావు, కె.వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్ట్

సీతమ్మధార : బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అక్కయ్యపాలెం రామచంద్రనగర్‌కి చెందిన 11 సంవత్సరాల బాలిక ఇంటికి వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి అడ్డుకుని చెయ్యి పట్టుకుని బలవంతంగా బైకు పైకి ఎక్కించడానికి ప్రయత్నించాడు. దీంతో భయపడిన బాలిక అతని బారి నుంచి తప్పించుకుని ఇంటికెళ్లి తల్లిదండ్రులకు విషయం వివరించింది. వెంటనే తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటికే స్థానికులు నిందితుడిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఫోక్సో చట్టం సీఐ ఎస్.విజయకుమార్ పర్యవేక్షణలో మహిళా ఎస్ఐ ప్రమీల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు విజయనగరం జిల్లా జామికి చెందిన ఎర్రినాయుడు(45)గా గుర్తించారు.